క్లుప్తంగా

క్యాలెండర్ ఆవిష్కరణ



మాసాయిపేటలో టీపీయూఎస్ క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

వెల్దుర్తి(తూప్రాన్): టీపీయూఎస్ నూతన సంవత్సర క్యాలెండర్, టేబుల్ క్యాలెండర్‌ను మాసాయిపేట ఉన్నత పాఠశాల ఆవరణలో ఆ సంఘం నాయకులు ఆవిష్కరించారు. మాసాయిపేట మండల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి మండల విద్యాధికారి లీలావతి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం ధర్మపురి, మండల అధ్యక్షుడు భద్రయ్య, జిల్లా బాధ్యుడు రంగారెడ్డి, ఉన్నత, ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చిలప్‌చెడ్‌లో..

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండల పరిధిలోని సోమక్కపేట్ ఉన్నత పాఠశాల ఆవరణలో గురువారం టీపీయూఎస్ మండల శాఖ ఆధ్వర్యంలో, మండల విద్యాధికారి విఠల్ చేతుల మీదుగా క్యాలెండర్, డైరీలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి మహేష్ కుమార్, కోశాధికారి యాదాగౌడ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ



సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న చైర్మన్, కౌన్సిలర్ తదితరులు

నర్సాపూర్: మున్సిపాలిటీలో సీసీ రోడ్ల నిర్మాణ పనులు చేపడుతున్నామని మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్ చెప్పారు. గురువారం మున్సిపాలిటీలోని ఐదో వార్డు కౌన్సిలర్ సురేష్‌తో కలిసి వార్డులో సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేశారు. పట్టణంలోని పలు వార్డులలో ఇప్పటికే సీసీ రోడ్ల నిర్మాణ పనులు చేపట్టామని, మిగిలిన వార్డులలో సైతం చేపడుతామని చెప్పారు. ఆయన వెంట మేనేజర్ మధుసూదన్ తదితరులు ఉన్నారు.

ఉచిత కంటి వైద్య పరీక్షలు సద్వినియోగం చేసుకోండి



విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

చిన్నశంకరంపేట(మెదక్): ఉచిత కంటి వైద్య పరీక్షలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ పుష్పవేణి కోరారు. గురువారం చిన్నశంకరంపేట మండలం మిర్జాపల్లి, కామారం, చందంపేట జెడ్పీ, ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఎల్వీ ప్రసాద్, ఎంఎస్‌రెడ్డి లయన్స్ కంటి ఆస్పత్రి వైద్యుల ఆధ్వర్యంలో ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఎప్పుడు వచ్చినా తమ ఆస్పత్రిలో ఉచిత వైద్యం అందిస్తామని వైద్యులు తెలిపారు. పరీక్షలు చేసిన విద్యార్థులకు అవసరమైన కంటి అద్దాలను అందించామని, శస్త్ర చికిత్సలు అవసరమైన వారిని ఆస్పత్రికి రిఫర్ చేసినట్లు తెలిపారు.

తంప్లూర్‌లో మహాపడి పూజ



తంప్లూర్‌లో పడిపూజ చేస్తున్న భక్తులు

టేక్మాల్(మెదక్): టేక్మాల్ మండలం తంప్లూర్‌లోని శివాలయంలో గురువారం సతీష్ పంతులు ఆధ్వర్యంలో అయ్యప్ప మహాపడిపూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయమంతా అయ్యప్పనామ స్మరణతో మారుమోగింది. నిర్వాహకులు వచ్చిన భక్తులకు తీర్థ ప్రసాదాలతో పాటు, అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో గ్రామపెద్దలు కొండ శంకర్, ఆకుల సంగయ్య, కర్రె మల్లేశం, బసంత్‌రావ్ పాల్గొన్నారు.

సీఎం కప్‌లో విద్యార్థిని సత్తా

జగదేవ్‌పూర్(గజ్వేల్): సీఎం కప్ రాష్ట్రస్థాయి పోటీల్లో 7వ తరగతి విద్యార్థిని జ్యోత్స్న ప్రతిభ చాటిందని ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ సీప్ల రాజ్ తెలిపారు. గత నెల 19న జిల్లా స్థాయి కిక్ బాక్సింగ్ పోటీలో పాల్గొందని పేర్కొన్నారు. అయితే జిల్లా స్థాయి సీఎం కప్‌లో అండర్–14 విభాగంలో గోల్డ్ మెడల్ సాధించిందని తెలిపారు.

శిథిలం... అసంపూర్ణం

ఎప్పుడో 30 ఏళ్ల క్రితం నిర్మించిన మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం. పూర్తిగా శిథిలావస్థకు చేరింది. ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితి. ఇరుకు గదుల్లోనే సిబ్బంది కార్యకలాపాలు కొనసాగిస్తున్నారు. ఈక్రమంలో నూతన భవన నిర్మాణానికి చర్యలు చేపట్టి పనులు ప్రారంభించారు. 12 ఏళ్లు అవుతున్నా నేటికీ అసంపూర్తిగానే ఉంది.

- శిథిలావస్థలో కొల్చారం తహసీల్దార్ కార్యాలయం
- అసంపూర్తిగా నూతన భవన నిర్మాణం
- ఇబ్బంది పడుతున్న సిబ్బంది, ప్రజలు



నిలిచిపోయిన నూతన భవన నిర్మాణ పనులు

కొల్చారం(నర్సాపూర్): మండల కేంద్రం ఏర్పాటు మొదట్లో అద్దె భవనంలో తహసీల్దార్ కార్యాలయం కొనసాగిస్తూ వచ్చారు. ఆ తర్వాత నూతన భవనం నిర్మాణం చేపట్టి కార్యకలాపాలు కొనసాగించారు. భవన నిర్మాణం చేపట్టి 35 ఏళ్లు గడుస్తున్న తరుణంలో ప్రస్తుతం పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. ఎక్కడికక్కడ బీటలు వారింది. వర్షం వచ్చిందంటే కార్యాలయంలోని రికార్డులు భద్రపరచాలన్న, సిబ్బంది కార్యకలాపాలు కొనసాగించాలన్న ఇబ్బందులు పడక తప్పని పరిస్థితి. దీంతో వివిధ పనుల కోసం వచ్చే ప్రజలు ఆరు బయట గంటల తరబడి ఎదురు చూడాల్సిన పరిస్థితి నెలకొంది. ఈక్రమంలో శిథిలావస్థకు చేరిన పాత భవనం పక్కనే నూతన భవన నిర్మాణం కోసం 2013 నవంబర్‌లో ప్రత్యేక నిధులు కింద రూ. 60 లక్షలు మంజూరు చేస్తూ అప్పుడు మంత్రిగా ఉన్న సునీతారెడ్డి పనులు ప్రారంభించారు. పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ స్లాబ్, గోడల వరకు పనులు పూర్తి చేసి, కేటాయించిన నిధులు సరిపోవడం లేదంటూ పనులను మధ్యలోనే నిలిపివేశాడు. దీంతో నాటి నుంచి నూతన భవన నిర్మాణాన్ని త్వరగా పూర్తిచేసి అందుబాటులోకి తీసుకురావాలని అప్పటి నుంచి ప్రతి మండల సమావేశాల్లో ప్రజాప్రతినిధులు మొరపెట్టుకుంటున్నా.. ఆ దిశగా చర్యలు తీసుకుంది లేదు. దీంతో ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న భవనం ప్రారంభానికి ముందే అక్కడక్కడ గోడలు బీటలు వారుతోంది. భవనం పూర్తి చేసేందుకు నిధుల కేటాయింపు కోసం ప్రతిపాదనలు పంపిస్తామని చెబుతున్న అధికారులు, నిధులు ఎప్పుడు విడుదల వుతాయన్న విషయమై స్పష్టమైన సమాచారం ఇవ్వడం లేదు. దీంతో నూతన భవన నిర్మాణ పనులపై నీలి నీడలు కమ్ముకున్నాయి.



బీటలు వారిన తహసీల్దార్ కార్యాలయం

పాలనాపరంగా ఇబ్బందులు



పాలనాపరంగా ఇబ్బందులు ప్రస్తుతం కొనసాగుతున్న భవనం శిథిలావస్థకు చేరుకుంది. పై నుంచి పెచ్చులు ఊడి కింద పడుతున్నాయి. వర్షాకాలం మరింత ఇబ్బందులు ఎదురవుతున్నాయి. విలువైన రికార్డులు, పరికరాలు భద్రపరిచేందుకు అవస్థలు పడుతున్నాం.

– గపూర్‌మియా, తహసీల్దార్

సహకార సంఘం ఏర్పాటు చేయాలి

టేక్మాల్(మెదక్): టేక్మాల్ మండలం బొడ్మట్‌పల్లిలో నూతన సహకార సంఘం ఏర్పాటు చేయాలని కోరుతూ ఆయా గ్రామాల ప్రజలు గురువారం మెదక్‌లో డీసీఓ కరుణాకర్‌కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మండలంలో 29 గ్రామ పంచాయతీలు ఉన్నాయని, టేక్మాల్‌లో ఒకే సహకార సంఘం ఉండటంతో ఇబ్బందిగా ఉందన్నారు. బొడ్మట్‌పల్లి పరిసర గ్రామాలైన కాద్లూర్, తంప్లూర్, సాలోజిపల్లి, బర్దిపూర్, దాదాయిపల్లి, మల్కాపూర్, పల్వంచ, ఎక్లాస్‌పూర్ తదితర గ్రామాలను కలుపుకొని నూతన సహకార సంఘం ఏర్పాటు చేయాలని కోరారు. ఈ విషయమై డీసీఓ సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో టేక్మాల్ పీఏసీఎస్ చైర్మన్ యశ్వంత్‌రెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్లు పాల్గొన్నారు.



డీసీఓకు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

ఆలయ సిబ్బందికి అభినందనలు



నాచగిరి ఆలయ అర్చక, సిబ్బందితో ఈఓ అన్నపూర్ణ

వర్గల్(గజ్వేల్): కార్తీక మాసంలో ఉత్తమ సేవలందించిన సిబ్బందిని నాచగిరి ఆలయ ఈఓ అన్నపూర్ణ అభినందించారు. గురువారం రాత్రి ఆలయ ముఖమండపంలో సిబ్బందితో కలిసి ఆలయ ఆమె సమావేశమయ్యారు. కార్తీక దీపోత్సవం, రాష్ట్ర ప్రభుత్వ విజయోత్సవ నిత్య కార్యక్రమాలు, ఇతర సేవలను సమర్థవంతంగా నిర్వహించామన్నారు. దీనికి ఆలయ ఉద్యోగులు, అర్చకులు, సిబ్బంది సహకారం ఎంతో ఉందన్నారు. సిబ్బందిని అభినందిస్తూ స్వామి వారి శేషవస్త్రాలతో ఘనంగా సన్మానించారు.

ప్రహరీకి.. ముళ్లకంపే కవచం

పాఠశాల ప్రహరీ కొంత భాగం కూలిపోతే ముళ్లకంపలు రక్షణ కవచంగా వేసి చేతులు దులుపుకొన్నారు. జిల్లాస్థాయి అధికారులు పరిశీలించి వెళ్లినా ఎంత మాత్రం మారలేదు. సందు దొరకింది అన్నట్లుగా విద్యార్థులు గోడ దూకి బయటికి వెళ్తున్నారు. ఒకవేళ ప్రమాదం బారిన పడితే సదరు తల్లిదండ్రులకు ఎవరు జవాబు చెబుతారంటూ పలువురు ప్రశ్నిస్తున్నారు.

- కొంత భాగం కూలిన గోడ
- దూకి బయటికెళ్తున్న విద్యార్థులు



గోడకూలిపోవడంతో రక్షణగా వేసిన ముళ్లకంపలు

హవేళిఘణాపూర్(మెదక్): మండల కేంద్రమైన హవేళిఘణాపూర్ ఎంజేపీ బాలుర రెసిడెన్షియల్ పాఠశాల చుట్టూ ప్రహరీలో కొంతభాగం కూలిపోయింది. యాజమాన్యం గోడపై ముళ్లకంపను వేశారే తప్ప మరమ్మతుకు చర్యలు తీసుకోలేదు. మరో వైపు ఈ భవనం ప్రభుత్వం లీజుకు తీసుకుంది. ఇటు అధికారులు.. అటు పాఠశాల యాజమాన్యం ఎవరైన చొరవ తీసుకోవాలని పలువురు విన్నవిస్తున్నారు. అయితే గోడ దూకి విద్యార్థులు బయటకు వెళ్లి ఫాస్ట్‌ఫుడ్, తినుబండారాలను హాస్టల్‌కు తీసుకు వచ్చిన సందర్భాలు ఉన్నాయని తెలుస్తోంది. ఒక వేళ అలా వెళ్లిన వారికి ఏదైనా ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రహరీ మరమ్మతుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

జిల్లా అధికారులు పర్యవేక్షించినా..

హవేళిఘణాపూర్ ఎంజేపీ బాలుర పాఠశాలను అదనపు కలెక్టర్ నగేశ్, ఆర్డీఓ రమాదేవిలు సైతం పాఠశాలను సందర్శించారు. కానీ పాఠశాల వసతులపై వారు ఎలాంటి ఆసక్తి చూపకపోవడం పట్ల పలువురు విద్యార్థుల తల్లిదండ్రుల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా స్థాయి అధికారులు స్పందించినా సమస్యలు మాత్రం అలాగే ఉండడం గమనార్హం.

ఎస్‌సీఈఆర్‌టీకి ఉపాధ్యాయుడి ఎంపిక



విద్యార్థుల సమక్షంలో కృష్ణమూర్తిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

మిరుదొడ్డి(దుబ్బాక): ఎస్‌సీఈఆర్‌టీ (స్టేట్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ అండ్ రీసెర్చ్ ట్రైనింగ్)కు మండల పరిధిలోని కాసులాబాద్ ప్రాథమిక పాఠశాలకు చెందిన ఉపాధ్యాయుడు ఎస్. కృష్ణమూర్తి ఎంపికయ్యారు. ఉద్యోగ రీత్యా ఐదు సంవత్సరాలుగా పాఠశాలకు ఒక్క సీఎల్ కానీ మరే ఇతర సెలవులు పెట్టలేదు. 2024–25 విద్యాసంవత్సరానికి ఎస్‌సీఈఆర్‌టీకి ఎంపిక కావడం పట్ల తోటి ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు. గురువారం ఆయన్ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో హెడ్‌మాస్టర్ విఠల్, టీచర్లు అందె రామచంద్రం, జి. శివకుమార్, కె. విద్యాప్రకాశ్, ఎస్. సురేశ్, టి.వినోద పాల్గొన్నారు.

అవకాశాలు అందిపుచ్చుకోవాలి

- ప్రిన్సిపాల్ శశిధర్

చిన్నశంకరంపేట(మెదక్): ఒకేషనల్ విద్యార్థులు స్కిల్స్‌తో అవకాశాలు అందిపుచ్చుకోవచ్చని చిన్నశంకరంపేట ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ శశిధర్ అన్నారు. గురువారం చిన్నశంకరంపేట ప్రభుత్వ కళాశాలలో జాబ్ ఓరియంటేడ్ ట్రెనింగ్‌లో పాల్గొన్న విద్యార్థులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతు రెండు నెలల పాటు క్షేత్రస్థాయిలో బ్యాంకులు, ప్రభుత్వ కార్యాలయాలలో పొందిన అనుభవం భవిష్యత్‌లో ఉపయోగపడనుందని చెప్పారు. డిజిటల్ రంగంలో శిక్షణ పొందిన విద్యార్థులు చక్కని నైపుణ్యతను అందిపుచ్చుకుంటే భవిష్యత్‌లో ఎన్నో అవకాశాలను పొందవచ్చన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు పాల్గొన్నారు.



టీజీబీ మేనేజర్‌ను సన్మానిస్తున్న ప్రిన్సిపాల్ శశిధర్

సంక్షిప్త వార్తలు

◆ **కోరేగావ్ స్థూపం సందర్శన**



కౌడిపల్లి(నర్సాపూర్): మహారాష్ట్ర పూణెలోని కోరేగావ్ స్థూపాన్ని మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు సంజీవ్, సంఘం నాయకులు గురువారం సందర్శించి నివాళులు అర్పించారు. అంబేడ్కర్ సైతం ప్రతి పోరాటానికి కోరేవావ్‌ను స్ఫూర్తిగా తీసుకునే వారని పేర్కొన్నారు. అందులో భాగంగానే స్థూపాన్ని సందర్శించి నివాళులు అర్పించినట్లు చెప్పారు. అతని వెంట మాలమహానాడు నర్సాపూర్, పాపన్నపేట మండలాల అధ్యక్షులు గోవు యాదగిరి, దండెం దుర్గన్న తదితరులు ఉన్నారు.

◆ **నూతన కమిటీల ఏర్పాటుపై తీర్మానం**

వెల్దుర్తి(తూప్రాన్): మండల కేంద్రమైన వెల్దుర్తిలో గురువారం బీజేపీ మండల ముఖ్య కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గ్రామస్థాయి నుంచి మండలస్థాయి వరకు నూతన కమిటీల ఏర్పాటుపై తీర్మానం చేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేందర్, ఓబీసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రమేశ్‌గౌడ్, మండల పార్టీ అధ్యక్షుడు నర్సింహులు, జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

◆ **పార్టీ పురోగతిపై అభిప్రాయ సేకరణ**

కొల్చారం(నర్సాపూర్): బీజేపీ మండల నాయకులు గురువారం సమావేశమయ్యారు. పార్టీ అధ్యక్షుడు, నాయకులతో మండల ఇన్‌చార్జి మల్లేశంగౌడ్ పార్టీ పటిష్టతపై అభిప్రాయ సేకరణ చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు దయాకర్ గౌడ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రఘువీరారెడ్డి, బీజేవైఎం మండల అధ్యక్షు హరీష్, ప్రధాన కార్యదర్శి నానితదితరులు పాల్గొన్నారు.

◆ **రామాయంపేటలో శోభాయాత్ర**

రామాయంపేట(మెదక్): రామాయంపేటలోని పాండువుల చెరువు కట్టపై ఉన్న నాగులమ్మ ఆలయంలో కొలువైన జ్యోతిర్లింగాలతోపాటు శివుని విగ్రహ శోభాయాత్ర బుధవారం రాత్రి నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు కోటి సత్యనారాయణ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమం లో వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.



మెరుగైన వైద్యం అందించాలి

- ఎమ్మెల్యే సునీతారెడ్డి

నర్సాపూర్: ఆటో బోల్తా ప్రమాదంపై ఎమ్మెల్యే సునీతారెడ్డి విచారం వ్యక్తం చేశారు. ప్రమాదంలో గాయపడిన క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పావనికి సూచించారు. శివ్వంపేట మండలం చిన్నగొట్టిముక్కుల వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన వారందరికి మెరుగైన వైద్యం చేయాలని, తీవ్రంగా గాయపడని వారిని సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి పంపి అవసరమైన వైద్యం అందజేయాలని సూచించారు. గాయాలపాలైన వారి కుటుంబ సభ్యులతో ఆమె ఫోన్‌లో మాట్లాడారు.



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

హత్నూర మండలం చందాపూర్‌కు చెందిన తేజకు రూ.లక్ష ఎల్‌ఓసీని సునీతారెడ్డి అందచేశారు. చిలిపిచెడ్ మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన రమేష్, ప్రవీణ్‌కుమార్, వినీలా, మల్లేశం, శేఖమ్మ తదితరులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందచేశారు.

హెచ్‌ఎం శంకర్ సేవలు మరువలేనివి

- ఎంఈఓ బాలరాజు



భుజిరంపేటలో హెచ్‌ఎం శంకర్ దంపతులను సన్మానిస్తున్న ఎంఈఓ తదితరులు

కౌడిపల్లి(నర్సాపూర్): విద్యార్థుల అభ్యున్నతికి కృషి చేసిన ప్రధానోపాధ్యాయుడు శంకర్ సేవలు మరువలేనివని ఎంఈఓ బాలరాజు తెలిపారు. గురువారం మండలంలోని భుజిరంపేట ప్రాథమిక పాఠశాలకు చెందిన శంకర్‌కు పదవీ విరమణ సందర్భంగా సన్మానసభను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ 14ఏళ్లుగా భుజిరంపేట పాఠశాలలో విధులు నిర్వహించి విద్యార్థులు, పాఠశాల అభివృద్ధికి కృషి చేశారని కితాబిచ్చారు. ఉపాధ్యాయులు, ఉద్యోగులు అతన్ని ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని కోరారు. ఈ సందర్భంగా శంకర్‌తోపాటు అతని భార్య శోభారాణిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు శ్యాంసుందర్‌రావ్, లింగం, ప్రభాకర్‌గౌడ్, ఇన్‌చార్జి హెచ్‌ఎం నరేష్, ఉపాధ్యాయ సంఘాల నాయకులు ప్రభురెడ్డి, గోపాల్, కిషన్, రమేష్, శేషగిరి, ఏశేందర్‌రెడ్డి, జ్ఞానప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

సర్వేను వేగవంతం చేయాలి

- ఎంపీడీఓ శ్రీనివాస్

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని ముత్రాజ్‌పల్లిలో ఇందిరమ్మ ఇళ్ల సర్వేను ఎంపీడీఓ శ్రీనివాస్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. దరఖాస్తు చేసుకున్న ప్రతి లబ్ధిదారుని ఇంటిని సర్వే చేయాలన్నారు. సర్వేను వేగవంతం చేయాలని చెప్పారు. లబ్ధిదారులు అందుబాటులో లేకపోతే ఫోన్‌ద్వారా సమాచారం ఇచ్చి సర్వేకు రమ్మని చెప్పాలని సూచించారు. సర్వేలో నిర్లక్ష్యం చేయవద్దన్నారు.



ముత్రాజ్‌పల్లిలో ఇందిరమ్మ ఇళ్లసర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

పీఆర్‌టీయూ క్యాలెండర్ ఆవిష్కరణ



హవేళిఘణాపూర్(మెదక్): క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంఈవో మధు

హవేళిఘణాపూర్(మెదక్): మండల కేంద్రమైన హవేళిఘణాపూర్ ఎంఆర్‌సీ కార్యాలయంలో ఎంఈవో మధుమోహన్ చేతుల మీదుగా గురువారం పీఆర్‌టీయూ క్యాలెండర్ ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తమ సంఘం దీర్ఘకాలికంగా ఉన్న ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో కీలక పాత్ర పోషిస్తుందని చెప్పారు. ఉపాధ్యాయుల సంక్షేమానికి ఎంతగానో కృషి చేస్తున్నామన్నారు. సంఘం మండల అధ్యక్షులు సుభాశ్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి నరేందర్‌రెడ్డి, శ్రీహరి, శ్రీనివాస్, మహిళా బాధ్యులు స్రవంతి, యూనిస్, గంగమణి, సంతోషికుమారి, శివరాజ్, రామరాజు ఉన్నారు.

పాపన్నపేట(మెదక్)లో..

పాపన్నపేట(మెదక్): మండల పీఆర్టీయూ ఆధ్వర్యంలో గురువారం పాపన్నపేటలో నూతన క్యాలెండర్‌ను మండల విద్యాధికారి ప్రతాప్‌రెడ్డి ఆవిష్కరించారు. కార్యక్రమంలో పాపన్నపేట పాఠశాల హెచ్‌ఎం మహేశ్వర్, పీఆర్టీయూ మండల శాఖ అధ్యక్షులు పంతులు రాజు, కార్యదర్శి సురేష్, పత్రిక సంపాదకుడు వెంకట్ రాంరెడ్డి, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు కృష్ణమూర్తి, సీహెచ్ వెంకటేశం, అంజాగౌడ్, కృష్ణకాంత్, ప్రవీణ్, వేణుగోపాల్ రెడ్డి, యాదయ్య, మునావత్ రజిత, పద్మ,మహేష్ ,అంజనా చారి, సతీష్, సిద్దిరాములు, నాగేశ్వర్, జనార్దన్, మేఘ్య, మోహన్‌రావు, రియాజ్, విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.



పాపన్నపేటలో ..



టేక్మాల్‌లో క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న పీఆర్‌టీయూ నాయకులు

టేక్మాల్(మెదక్)లో..

టేక్మాల్(మెదక్): పీఆర్‌టీయూ టేక్మాల్ మండల శాఖ ఆధ్వర్యంలో నూతన సంవత్సర క్యాలెండర్‌ను గురువారం ఆవిష్కరించారు. టేక్మాల్ మండల విద్యాధికారి పి.సుజాత, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు కె.రాజేంద్రప్రసాద్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం మెదక్ జిల్లా గౌరవ అధ్యక్షులు ఏ.దుర్గయ్య, టేక్మాల్ మండల శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎండీ అమీరుద్దీన్, సీహెచ్ సహదేవ్, సీనియర్ నాయకులు కె.బాల్య, బి వినోద్ కుమార్, రమేష్, సతీష్ రావు, నాగరాజు, సుజాత, మాధవిలత, రమాదేవి, గౌతమి, శ్రీకాంత్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

బాలసాహిత్య సమావేశానికి తరలిరండి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ఈనెల 5న జిల్లాకేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో పెందోట బాలసాహిత్య పీఠం ఆధ్వర్యంలో నిర్వహించనున్న బాలసాహిత్య సమావేశాన్ని విజయవంతం చేద్దామని, పెందోట బాలసాహిత్య పీఠం అధ్యక్షుడు వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం పట్టణంలో బాలసాహిత్య సమావేశానికి సంబంధించిన కరపత్రం ఆవిష్కరించారు. ఈ సమావేశంలో భాగంగా 2024 కవితల పోటీలలోని విజేతలకు బహుమతులు ప్రదానం, పలు పుస్తకాలను ఆవిష్కరించనున్నట్లు తెలిపారు. సమావేశానికి ముఖ్యఅతిథిగా డాక్టర్ కాసర్ల నరేశ్‌రావు పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో చంద్రయ్య, వరికోలు లక్ష్మయ్య, కోణం పర్శరాములు, నార్లపురం రాములు, అనిశెట్టి సతీశ్, పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయండి

- తెలంగాణ రాష్ట్ర యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు శివచరణ్‌రెడ్డి

దుబ్బాకటౌన్: కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి యువత కృషి చేయాలని తెలంగాణ రాష్ట్ర యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు శివచరణ్ రెడ్డి పిలుపునిచ్చారు. ఇటీవల జరిగిన యూత్ కాంగ్రెస్ ఎన్నికల్లో తెలంగాణ రాష్ట్ర యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఆయన గెలిచిన సందర్భంగా గురువారం మర్యాద పూర్వకంగా కలిసి శాలువ కప్పి సన్మానించారు. హైదరాబాద్‌లోని మహాత్మా జ్యోతిరావు పూలే ప్రజాభవన్‌లో యూత్ కాంగ్రెస్ దుబ్బాక నియోజకవర్గ ఉపాధ్యక్షుడు బురాని శ్రీకాంత్, దుబ్బాక మున్సిపల్ యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు కడవెర్గు గోపి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. దుబ్బాక నియోజకవర్గ ఉపాధ్యక్షుడిగా గెలుపు పొందిన శ్రీకాంత్‌ను సైతం శివచరణ్ సత్కరించారు. యువత పార్టీ బలోపేతానికి కృషి చేయాలని వారికి తన సహాయ, సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయన్నారు.



శివచరణ్‌రెడ్డిని సన్మానిస్తున్న దుబ్బాక యూత్ కాంగ్రెస్ నాయకులు